క్లుప్తంగా

కమనీయం.. కల్యాణం



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30గంటల నుంచి అప్పన్న నిత్యకల్యాణ ఘట్టం ప్రారంభమైంది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

అప్పన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే పద్మావతి



ఆశీర్వచనం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని మంగళవారం అనంతపురం జిల్లా శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆమె పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని ట్రస్ట్‌బోర్డు సభ్యుడు దినేష్‌రాజ్ ఆమెకు అందజేశారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి విశేష అభిషేకాలు



సుబ్రహ్మణ్యస్వామి

సింహాచలం: అడవివరం విజినిగిరిపాలెం లోని ఉమాచంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో కొలువైన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మంగళవారం అభిషేకాలు, పూజలు విశేషంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్ కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.

గిరిజనులకు నేత్ర పరీక్షలు

సింహాచలం: సింహగిరి గిరిజన గ్రామంలో మంగళవారం గోపాలపట్నం సీటూ జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. నగరంలోని స్ఫూర్తి హెల్త్ ఎడ్యుకేషన్‌కు చెందిన జె.రవికుమార్, సాగర్ 50 మంది గిరిజనులకు కంటి పరీక్షలు చేశారు. కంటి సమస్యలపై అవగాహన కల్పించారు. గిరిజన నాయకులు కుంది వరప్రసాద్, పోలమ్మ, సన్యాసిరావు, గోపాలపట్నం సీటూ జోన్ ప్రధాన కార్యదర్శి పి.సత్యనారాయణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సిరుల తల్లికి స్వర్ణ పుష్పార్చన



లక్ష కుంకుమార్చనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారికి మంగళ వారం స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8గంటల వరకు జరిపించిన అష్టదళ పద్మారాధనలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

కనక మహాలక్ష్మికి లక్ష కుంకుమార్చన

నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం లక్ష కుంకుమార్చన ప్రత్యేక పూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు నిర్వహించిన ప్రత్యేక పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ట్రస్ట్ బోర్డ్ చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు పాల్గొన్నారు.

రేపు సహస్ర తులసి పూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 9న గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే దంపతులు రూ.1500 పూజా రుసుం చెల్లించి, పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

టీడీపీ కుట్రలను తిప్పికొట్టండి

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- ఉత్సాహంగా గడపగడపకు ..



పల్లివారిదొడ్డిలో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించాలని టీడీపీ నాయకులు చేస్తున్న కుట్రలు, తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పిలుపునిచ్చారు. నాయుడుపాలెం శివారు హస్తినాపురం, తమ్మయ్యపాలెం, పల్లివారిదొడ్డి, బందారుపాలెం, గంగునాయుడుపాలెంలో మంగళవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యేకు మహిళలు, స్థానికుల నుంచి ఘన స్వాగతం పలికారు. సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మీసీతారామయ్యతో కలిసి ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. ప్రజలతో మమేకమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో ఏదో విధంగా గద్దెనెక్కాలని టీడీపీ కుట్రలు పన్నుతుందని వారి మాయలో పడకుండా అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. ప్రజల అవసరాలను ముందుగా గుర్తించి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే 2024 ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రి చేయడానికి ప్రజలంతా ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు, ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం సర్పంచ్‌లు చింతకాయల సుజాతముత్యాలు, చేపల మసేను, అరిజిల్లి దేవిరవి, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, లంకెలపాలెం పీఏసీఎస్ చైర్మన్ బురద రాజు, నాయుడుపాలెం ఉప సర్పంచ్ ముత్యాలు, వైఎస్సార్‌సీపీ నాయకులు బి.కృష్ణబాబు, యమహానాయుడు, కస్నూరు నేస్తాలు, బి.శ్రీను, కృష్ణంనాయుడు, గంగునాయుడు, బి.శ్రావణ్‌కుమార్, ఆర్.సత్యనారాయణ పాల్గొన్నారు.

సీతారామాలయ వార్షికోత్సవాలు ప్రారంభం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న పీతల విష్ణుమూర్తి, ఆలయ కమిటీ ప్రతినిధులు

సింహాచలం: జీవీఎంసీ 98వవార్డు సింహపురికాలనీలోని సీతారామాలయ 20వ వార్షికోత్సవాలు మంగళవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. 98వవార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు పీతల విష్ణుమూర్తి జ్యోతిప్రజ్వలన చేసి వార్షికోత్సవాలను ప్రారంభించారు. ఆలయ అర్చకుడు హరిప్రసాద్ ఆధ్వర్యంలో రుత్విక్ వరణం, యాగశాల ప్రవేశం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంతకు ముందు స్వామికి అభిషేకం, సింహపురికాలనీకి చెందిన శ్రీమతి నందూరి వెంకటలక్ష్మి, వి.శారద, సత్యారాధ తదితరులు దివ్యప్రబంధ పారాయణం, సాయంత్రం సింహపురి లేఅవుట్ భక్త బృందం విష్ణుసహస్రనామ పారాయణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సీవీఆర్ మూర్తి, సెక్రటరీ ఏపీ చలపతిరావు, రామారావు, నాయుడు, రాజయ్య తదితరులు పాల్గొన్నారు. బుధవారం రాత్రి 7గంటల నుంచి సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

ఘనంగా వీరాంజనేయ స్వామి తీర్థం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

సబ్బవరం: మండలంలోని ఆరిపాక శివారు చినయాతపాలెంలో శ్రీ వీరాంజనేయ తీర్థమహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది.వేకువ జాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన దొడ్డి కల్యాణి, కె. శారద, మళ్ల తులసి, షేక్ ఫాతిమాలకు ఉత్సవ కమిటీ సభ్యులు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ శరగడం దుర్గినాయుడు, సభ్యులు మళ్ల బాలాజీ,మళ్ల నాగభూషణం,మళ్ల రాము,శరగడం సత్యనారాయణ,మళ్ల గంగునాయుడు తదితరులు ఉన్నారు.

ఇంటర్నెట్ వినియోగంలో అప్రమత్తత అవసరం



ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులతో డీఎస్ఎన్ఎల్‌యూ విద్యార్థులు

సబ్బవరం: ఇంటర్నెట్,సామాజిక మాధ్యమాలు వినియోగించే విషయంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం అధ్యాపకుడు బయోలా కిరణ్ అన్నారు. సేఫ్ ఇంటర్నెట్‌డే సందర్భంగా సబ్బవరంలోని డీఎస్ఎన్ఎల్‌యూ విద్యార్థులు మంగళవారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరస్తులు నేరాలకు పాల్పడుతున్నతీరు, అంతర్జాలం,సామాజిక మాధ్యమాల్లో మన భద్రతను నిర్లక్ష్యం చేస్తే ఎదురయ్యే పర్యవశానాలను వివరించారు. ఇంటర్నెట్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై ఆన్‌లైన్‌లో ఎలా ఫిర్యాదు చేయాలో వివరించారు. వీటిపై అదనపు సమాచారం అందించేందుకు లీగల్ టూల్ కిట్లు కూడా పంపిణీ చేశారు. కార్యక్రమంలో లీగల్ సర్వీసెస్ సెల్ ఫ్యాకల్టీ కన్వీనర్ బీవీఎస్ సునీత, విద్యార్థులు దివ్యశ్రీ,సాహితి,షెహనాజ్,చరిష్మా,ప్రితవ్,పవన్,సాకేత్, హర్ష,రాహుల్,మాధవి,మానస,మిహిర,అమృత,ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ ఆపేవరకు ఉద్యమం



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు రామకృష్ణ

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపే వరకు కార్మికుల ఉద్యమాలు ఆగవని పోరాట కమిటీ నాయకులు అన్నారు. కేంద్రప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకుని, పార్లమెంట్‌లో ప్రకటించేవరకు దీక్షలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహారదీక్షల్లో 726వ రోజు మంగళవారం బ్లాస్ట్‌ఫర్నేస్ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీక్షలో కూర్చున్న కార్మికులను ఉద్దేశించి పోరాట కమిటీ నాయకులు జె.రామకృష్ణ, యు.రామస్వామి మాట్లాడారు. ప్లాంట్‌ను అభివృద్ధి పథంలో నడిపేందుకు గత 30 ఏళ్లుగా కార్మికులు ఎంతగానో శ్రమించారన్నారు. నిర్వాసితుల త్యాగాన్ని, కార్మికుల కష్టాన్ని పట్టించుకోకుండా ప్రభుత్వరంగ పరిశ్రమలను అమ్మాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణను విరమించే వరకు వినూత్న రీతిలో పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు ఐక్యంగా పోరాడాలని కోరారు. కార్యక్రమంలో సాయిరాం, రవికిరణ్, ఈశ్వరరావు, మధు, వెంకటరావు, నగేష్, నల్ల రవి, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఉపాధి సృష్టించే స్థాయికి విద్యార్థులు ఎదగాలి

ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల స్వాగత సభలో ఏయూ వీసీ ప్రసాదరెడ్డి



విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఉపాధి అవకాశాలను సృష్టించే స్థాయికి ఆంధ్ర విశ్వవిద్యాలయ విద్యార్థులు ఎదగాలని వర్సిటీ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి ఆకాంక్షించారు. మంగళవారం ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ఏయూ ఆర్ట్స్, కామర్స్ కళాశాల విద్యార్థులకు నిర్వహించిన స్వాగత సభలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఉపాధి కోసం ఎదురుచూడకుండా అవకాశాలను సృష్టించే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా, ఆవిష్కర్తలుగా ఎదగాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కోరుకుంటున్నారన్నారు.

దీనికి అవసరమైన వ్యవస్థను విశ్వవిద్యాలయంలో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశామన్నారు. క్రమ శిక్షణకు వర్సిటీ అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. గత రెండు సంవత్సరాలుగా ప్లేస్‌మెంట్ సంఖ్య పెరగడం, విద్యార్థులు అధిక వేతనాలతో ఉద్యోగాలను సాధించడం చూస్తున్నామన్నారు. ఆర్ట్స్ కళాశాలకు పునరుజ్జీవనం, పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు. కళాశాల పరిధిలో 97 శాతానికి పైగా సీట్లు భర్తీ కావడం దీనికి నిదర్శనమన్నారు. వర్సిటీ క్యాంపస్‌లో ఆరు విధాలైన స్టార్టప్ ఎకోసిస్టంలను అభివృద్ధి చేసిన విధానాన్ని వివరించారు. 21 శతాబ్దపు నైపుణ్యాలను యువతలో పెంచేలా ప్రత్యేకంగా నైపుణ్య కేంద్రాలను ప్రారంభిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుపై అవగాహన ర్యాలీ



ఆదిరెడ్డిపాలెంలోర్యాలీ నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

సబ్బవరం: ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలు ఉత్పత్తి చేసుకోవచ్చని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ జానకి అన్నారు.మండలంలోని సబ్బవరం శివారు ఆదిరెడ్డిపాలెంలో ప్రకృతి వ్యవసాయంపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల మానవాళితో పాటు మూగజీవాలు, పర్యావరణానికి మరింత మేలు కలుగుతుందన్నారు. అలాగే తక్కువ ఖర్చుతో ఆరోగ్యకరమైన పంట దిగుబడులు అధికంగా సాధించవచ్చని చెప్పారు. ఖరీఫ్ పంటలకు ముందు నవధాన్యాల పంటలు వేయడం గురించి అవగాహన కల్పించారు. 30 రకాల పీఎండీఎస్ విత్తనాల గురించి రైతులకు తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జె. శ్రీనివాస్,పి. సత్యనారాయణ,కె. శ్రీనివాస్‌తో పాటు రైతులు ఆదిరెడ్డి దుర్గమ్మ, కొటాన సత్యవతి, కొటాన కుమారి,కొటాన లలిత తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలో మౌళీచంద్ ప్రతిభ

సింహాచలం: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఇటీవల తపాలాశాఖ నిర్వహించిన స్టాంప్ డిజైన్ పోటీల్లో సత్తా చాటిన విద్యార్థి ఆదిరెడ్డి మౌళీచంద్‌ను పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అభినందించారు. జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడలోని కేకే ఆర్ గౌతమ్ హైస్కూల్లో మౌళీచంద్ పదో తరగతి చదువుతున్నాడు. భారత తపాలాశాఖ ఇటీవల ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా దేశవ్యాప్తంగా స్టాంప్ డిజైన్ పోటీలు నిర్వహించింది. దేశవ్యాప్తంగా పదిమంది మాత్రమే ఉత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా ఎంపికయ్యారు. మన రాష్ట్రం నుంచి కేవలం మౌళీచంద్ మాత్రమే ఎంపికయ్యాడు. ఈనెల 12న న్యూ ఢిల్లీలో ప్రధాని నరేంద్రమోదీ, రైల్వే మంత్రి చేతులమీదుగా బహుమతి అందుకోనున్నాడు. గ్రామానికి చెందిన విద్యార్థి మౌళీచంద్ ప్రతిభ చూపడంతో మంగళవారం ఎమ్మెల్యే తన ఇంటికి మౌళీచంద్‌ను ఆహ్వానించి అభినందించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ శ్రీరాములు, సెక్రటరీ పైడిరాజు, మాజీ సర్పంచ్ చినబాబు, యూత్ ప్రెసిడెంట్ గోవింద తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై భవన నిర్మాణ సామగ్రి



వాడచీపురుపల్లి-ముత్యాలమ్మపాలెం రహదారి మలుపులో వేసిన ఇసుక గుట్ట

పరవాడ: పలు గ్రామాల్లో రహదారులపై ఇష్టానుసారంగా వేస్తున్న భవన నిర్మాణ మెటీరియల్‌తో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నూతన భవనాల నిర్మాణానికి అవసరమైన ఇసుక, రాయి, ఇటుక, పిక్క తీసుకువచ్చి రహదారులపై నిల్వ చేయడంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వాడచీపురుపల్లి-ముత్యాలమ్మపాలెం రహదారిలో సిమ్మన్నగారి దొడ్డి వద్ద నడిరోడ్డు పై వేసిన ఇసుక గుట్ట ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. ఈ రహదారిలో నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు, కార్మికులు, విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్నారు. రోడ్డుపై వేసిన ఇసుక గుట్ట చెల్లాచెదురుగా మారడంతో రహదారిలో ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాలు ఇసుకలో జారిపోయి ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్లను భవన నిర్మాణ మెటీరియల్‌కు ఉపయోగిస్తున్న వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆక్రమణల తొలగింపు



బడ్డీని తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

సింహాచలం: జీవీఎంసీ 94వ వార్డు నాయుడుతోట జంక్షన్‌లో బీఆర్‌టీఎస్ రోడ్డును ఆనుకుని సర్వేనెంబరు 90లోని ఖాళీస్థలంలో ఆక్రమణలను పెందుర్తి రెవెన్యూ అధికారులు మంగళవారం తొలగించారు. ఇక్కడి ఖాళీ స్థలాన్ని ఆక్రమిస్తున్నారని పలువురు స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు.ఈ మేరకు అక్కడ ఉన్న ప్రభుత్వ భూమిని గుర్తించి అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. కాగా అదే స్థలాన్ని మళ్లీ చదును చేసి ఐరన్ బడ్డీ ఆక్రమణదారులు ఏర్పాటు చేయడంతో విషయాన్ని స్థానికులు జేసీ దృష్టికి తీసుకెళ్లారు. దాంతో ఆయన ఆదేశాల మేరకు పెందుర్తి తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పోలీసుల సహకారంతో ఆక్రమణ స్థలంలో ఏర్పాటు చేసిన బడ్డీని తొలగించారు. సంబంధిత స్థలం ప్రభుత్వ భూమిఅని, ఆక్రమణదారులు శిక్షార్హులని హెచ్చరించారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సబ్బవరం: మండలంలోని సబ్బవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని సబ్బవరం, పరవాడ మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీవో లలిత్ కుమారి మంగళవారం తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పదోతరగతి పరీక్షలో ఉత్తీర్ణులై 01-07-2022 నాటికి 21 నుంచి 35 సంవత్సరాలలోపు ఉండాలన్నారు. స్థానికంగా ఉండే వివాహమైన మహిళలై ఉండాలని పేర్కొన్నారు. ఈ నెల 13వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో లేదా రిజిస్టర్ పోస్టులో అందజేయవచ్చన్నారు.

మండలం	పంచాయతీ	అంగన్‌వాడీ కేంద్రం	రిజర్వేషన్
సబ్బవరం	వంగలి	వంగలి-2	ఎస్సీ
సబ్బవరం	తవ్వవానిపాలెం	తవ్వవానిపాలెం-2	ఎస్సీ
సబ్బవరం	అమృతపురం	అమృతపురం-2	ఎస్సీ
సబ్బవరం	అమృతపురం	సూరెడ్డిపాలెం	ఎస్సీ
పరవాడ	వాడచీపురపల్లి	దళాయిపాలెం	ఎస్సీ

దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: ప్రభుత్వ న్యూ ఐటీఐలోని డ్రైవింగ్ స్కూల్‌లో హెవీ మోటార్ వెహికల్, లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఐటీఐ ప్రిన్సిపాల్ లండ సుధాకరరావు తెలిపారు. అభ్యర్థులు పదో తరగతి పాసై ఉండాలని, 18 ఏళ్లు నిండిన వారు అర్హులని పేర్కొన్నారు. 45 రోజుల శిక్షణ కు ఎల్ఎల్ఆర్ కలిగి ఉండాలని సూచించారు. ఈ నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

జేఈఈ మెయిన్స్‌లో విశాఖ సత్తా

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో విశాఖ విద్యార్థులు సత్తా చాటారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మంచి పర్సంటైల్ సాధించారు. విశాఖ ఖ్యాతిని చాటి చెప్పారు. ఈ సందర్భంగా ఆయా కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను అభినందించాయి.

నారాయణ ప్రభంజనం

సీతమ్మధార: జేఈఈ మెయిన్-2023 ఫలితాల్లో నారాయణ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని సంస్థ డీజీఎం హనుమంతరావు, డీన్ జి.రామలింగేశ్వరరావు తెలిపారు. తమ సంస్థ విద్యార్థులు పి.తేజశ్రీ 99.986295, ఎంవీవీ హర్షవర్ధన్ 99.9856388, ఎల్.అనన్య 99.9642468, సీహెచ్ వెంకట యశ్వంత్ 99.9409876, పి.బాలాజీ అభిషేక్ 99.9339384, ఎం.అనుశ్రీ 99.9248252, వి.యశస్వినాయుడు 99.9244526, ఎం.సుభాసివర్మ 99.9231306, ఎస్.మౌనిషా నాయుడు 99.9071369, పి.సాత్విక 99.9054354 పర్సంటైల్ సాధించినట్లు చెప్పారు. ఈ ఫలితాల్లో 56 మంది విద్యార్థులు 99 పర్సంటైల్ కంటే అధికంగా సాధించారని వెల్లడించారు. విద్యార్థులు, అధ్యాపకులను డీజీఎం, డీన్ అభినందించారు.

తిరుగులేని శశి

తగరపువలస: సంగివలస శశి విద్యార్థులు జేఈఈ మెయిన్ ఫలితాల్లో అత్యధిక పర్సంటైల్ సాధించినట్టు ఆ విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. కె.అభిరామ్ 99.89, బి.కావ్య 99.84, పి.సాయిరాం 99.75, ఆర్.సాయినారాయణ 99.61, ఎం.నాగదుర్గా సతీష్ 99.57, కె.సాయికృష్ణ రమేష్ 99.33, డి.వి.వి చైతన్య 99.28, వి.శ్రీసూర్య గుణ్వంత్ 99.14, ఎ.రంజిత్‌కుమార్ 99.14, ఇ.గౌతం ధీరజ్ 99.01 పర్సంటైల్ సాధించారన్నారు. అలాగే 99 పైన 10 మంది, 98 పైన 20 మంది, 97 పైన 33, 96 పైన 41, 95 పైన 48 మంది పర్సంటైల్ సాధించినట్లు చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థులను వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, డైరెక్టర్ మేకా క్రాంతి సుధ అభినందించారు.

శ్రీ చైతన్య హవా

విశాఖ విద్య: జేఈఈ మెయిన్ ఫలితాల్లో విశాఖ శ్రీ చైతన్య ఐఐటీ అకడామీ విద్యార్థులు సత్తా చాటారు. ఎం.ప్రశాంతి శ్రీజ, ఎస్.అనిరుధ్, ఎన్.సిద్ధార్థ, రహమాన్ షేక్ జమీల్, డి.సాకేత్ నాయుడు, కె.శ్రీ కార్తిక్, జి.హరిచరిణి, ఆర్.మోహిత్ నాయుడు 99 పైగా పర్సంటైల్ ఎగ్జిక్యూటివ్ ఏజీఎం కె.వి.రమణ తెలిపారు. విద్యార్థులను సంస్థ డీన్లు ఎన్.రఘుకుమార్, కె.బంగారు బాబు, జె.సత్యనారాయణ, పి. సత్యనారాయణ అభినందించారు. అధ్యాపక, అధ్యాపకేతర బృందాన్ని అభినందించారు.

శ్రీవిశ్వ విజయకేతనం

సీతంపేట: జేఈఈ మెయిన్-2023 ఫలితాల్లో శ్రీ విశ్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యధిక పర్సంటైల్ సాధించారు. సీహెచ్.ప్రతీష్ 99.61 పర్సంటైల్, బి.తనూజ 99.33, ఎ.మహర్షి 99.27, బి.కార్తీక్ శశాంక్ 99.25, ఎల్.హేమంత్ 99.25 పర్సంటైల్ సాధించారు. ఐదుగురు విద్యార్థులు 99 పర్సంటైల్ పైగా, 18 మంది విద్యార్థులు 98 పర్సంటైల్ పైగా సాధించినట్లు శ్రీ విశ్వ విద్యా సంస్థల కె.ధర్మరాజు, డైరెక్టర్ పి.సూర్యనారాయణ తెలిపారు. విద్యార్థులను అభినందించారు.

ఫిట్జీ విద్యార్థుల ప్రతిభ

సీతంపేట: జేఈఈ మెయిన్ ఫలితాల్లో ఫిట్జీ వైజాగ్ సెంటర్ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారు. షేక్ ఆవేజ్ మెహతాబ్ 99.96, నితిల్ కవిన్ 99.96, పీలా రత్న హర్ష 99.93, ఆయుష్ మార్తాండ్ బోర్కర్ 99.88, పెండెల హర్షిత్ 99.85, యు.ఎల్.ఎస్.ఎస్.వైభవ్ 99.85, రూపేష్ మల్లిరెడ్డి 99.82, ఆనంద్ సిద్ధార్థ్ 99.32 పర్సంటైల్ సాధించారని సెంటర్ హెడ్ పెండేల మస్తాన్‌రావు తెలిపారు. ఫిట్జీ వైజాగ్ సెంటర్ నుంచి 462 మంది హాజరు కాగా 22 మంది విద్యార్థులు 99 కంటే ఎక్కువ, 106 మంది 95 కంటే ఎక్కువ, 174 మంది 90 కంటే ఎక్కువ పర్సంటైల్ సాధించినట్లు వెల్లడించారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

కూర్మన్నపాలెం: దువ్వాడ మంగళపాలెం ప్రాంతానికి చెందిన సంపంగి త్రినాథ్ (46) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళపాలెం ప్రాంతంలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం బ్లాక్ నెంబర్ 63లోని ఎఫ్ఎఫ్-4లో ఉంటున్న సంపంగి త్రినాథ్ రియల్ ఎస్టేట్ వ్యాపారి. కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యపిల్లలు దూరంగా ఉంటున్నారు. దీంతో మనస్తాపంతో త్రినాథ్ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. అయితే, ఆయన ఒంటరిగా ఉండడంతో మృతి చెందిన విషయం ఎవరికీ తెలియలేదు. మంగళవారం సాయంత్రం వారు నివసిస్తున్న బ్లాక్‌లో నీరు ఎక్కడం లేదని పైన ట్యాంక్ చూసేందుకు సుమారు 5గంటల సమయంలో పైకి వెళ్లిన స్థానికులకు త్రినాథ్ కిటికీ హుక్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. వెంటనే వారు 100కి డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి సోదరుడు రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.